సాక్షి
ప్రకాశం
మంగళవారం । 26 । మార్చి । 2024





### చూచిన కనులదే భాగ్యం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో లక్ష్మీ అలమేలు మంగా సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం వేకువజామున కన్నుల పండువగా నిర్వహించారు.

- 8లో..



### వాసన్న ఆధ్వర్యంలోనే యాదవుల సంక్షేమం

బాలినేని వాసన్న ఆధ్వర్యంలోనే జిల్లాలో యాదవుల సంక్షేమం జరిగిందని వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్‌ అన్నారు.

- 8లో..

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
34/25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

### రంజాన్‌ వేళలు

మంగళవారం - ఇఫ్తార్‌ : సా॥ 6.27

బుధవారం - సహరీ : ఉ॥ 4.49



## న్యూస్‌రీల్‌

### మాదిగ జాతి ద్రోహి మందకృష్ణ

దర్శి: మాదిగలను ప్రత్యక్షంగా, పరోక్షంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు తాకట్టు పెట్టి తాను లబ్ధి పొందేందుకు మందకృష్ణ కుటిల బుద్ధిని ప్రదర్శిస్తున్నాడని వైఎస్సార్‌ సీపీ ఎస్సీసెల్‌ జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్‌ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకుని నానా ఇబ్బందులు పెట్టిన టీడీపీకి మందకృష్ణ మద్దతు ప్రకటించడాన్ని దేవ ప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 2014లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మద్దతు తెలిపి, 2019లో నోటాకు ఓట్లు వేయమని చెప్పిన మందకృష్ణ.. రానున్న ఎన్నికల్లో మళ్లీ కూటమికి మద్దతు ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మందకృష్ణ చెబుతున్న వర్గీకరణ అంశం ఈ పదేళ్లలో ఒక్క అంగుళం అయినా ముందుకు కదిలిందా అని నిలదీశారు. ఎమ్మార్పీఎస్‌ ఉద్యమం కోసం గ్రామ స్థాయిలో కష్టపడి పని చేసిన వారిని మందకృష్ణ ఎలా తొక్కుకుంటూ పైకొచ్చాడో అందరికీ తెలుసన్నారు. ఎమ్మార్పీఎస్‌ ఉద్యమాన్ని అడ్డు పెట్టుకుని ఆర్థికంగా ఎదుగుతూ వ్యాపారాలు నడుపుతున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్యాకేజీ కోసమే దళిత ద్రోహి చంద్రబాబు, బీజేపీ, జనసేన కూటమికి మందకృష్ణ మద్దతు తెలిపాడని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఎన్నికలప్పుడు మాత్రమే మాదిగలు గుర్తుకు వస్తారని, ముందు పొగడటం ఆ తర్వాత విస్మరించడం ఆయనకు పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు.

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పొత్తు పార్టీల్లో కుమ్ములాటలు ముదిరి పాకాన పడుతున్నాయి. పొత్తుల పేరుతో సీట్లు దక్కని జనసేనలు అసమ్మతి రాగాన్ని ఆలపిస్తున్నారు. జిల్లాలో పొత్తులో భాగంగా దర్శి, గిద్దలూరు నుంచి అవకాశం వస్తే పోటీ చేయాలని ఆశించారు. అయితే గిద్దలూరు సీటు టీడీపీకి కేటాయించడంపై గ్లాసు పార్టీ నేతలు భంగపడి ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఆ పార్టీ నేత ఆమంచి స్వాములు ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధమవుతున్నారు. దర్శి సీటును ఒకవేళ జనసేనకు ఇచ్చినా టీడీపీ నుంచి వచ్చిన వారికి ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక జిల్లా కేంద్రం ఒంగోలులో టీడీపీ ప్రచారానికి జిల్లా జనసేన నేతలు దూరంగా ఉంటున్నారు. జిల్లాలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉంది రెండు పార్టీల పరిస్థితి.



- గిద్దలూరు సీటు టీడీపీకి ఇవ్వడంపై జనసేనుల అసంతృప్తి
- ఇండిపెండెంట్‌గా పోటీకి ఆమంచి స్వాములు సన్నాహాలు
- ఆమంచి వైపే మెజార్టీ జనసేన
- దర్శిపై చంద్రబాబు దోబూచులాట
- జిల్లా జనసేనలో వర్గాల కుమ్ములాటలు

# పొత్తు కయ్యం..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో టీడీపీ, జనసేనల మధ్య రాజకీయం రసవత్తరంగా మారింది. రెండు పార్టీల నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. పశ్చిమ ప్రకాశంలో కీలకమైన గిద్దలూరు నియోజకవర్గంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సీటును తెలుగుదేశం పార్టీకి కేటాయించడం పట్ల జనసేన నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. మొదటి నుంచి ఈ సీటును జనసేనకు ఇస్తామంటూ ప్రచారం చేసి చివరికి తెలుగుదేశం పార్టీకి కేటాయించడం వెనక దుష్ట శక్తుల కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమంచి స్వాములను గిద్దలూరు నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించారు. అయితే టీడీపీ, జనసేన పొత్తుల తరువాత కూడా కొంతకాలం ఇదే కథ నడిపించారు. చివరికి గిద్దలూరు సీటు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జనసేన నాయకులు మోసపోయినట్లు గ్రహించారు. నమ్మించి మోసం చేశారని ఆగ్రహం చెందిన ఆమంచి స్వాములు జనసేన పార్టీ పదవులకు రాజీనామా చేశారు. ఈ పరిణామాలు జరుగుతుండగానే టీడీపీ అభ్యర్థి అశోక్‌ రెడ్డి జనసేనలో చిచ్చు పెట్టారు. రెండు గ్రూపులను సృష్టించారు. జనసేనలో కాసుల పాండు, బెల్లంకొండ సాయిబాబు గ్రూపులు ఏర్పడ్డాయని కార్యకర్తలు మండిపడుతున్నారు.

### రెబల్‌గా స్వాములు..

ఆమంచి స్వాములు ఆదివారం రాత్రి కంభంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో తెలుగుదేశం నాయకత్వంపై ఫైర్‌ కావడం సంచలనం సృష్టించింది. ఓడిపోయే సీట్లను జనసేనకు కట్టబెడుతున్నారని ఆయన చేసిన విమర్శలు పెద్ద దుమారం లేపాయి. జిల్లా నుంచి కనీసం ఒక్క సీటైనా జనసేనకు ఎందుకు కేటాయించలేదన్న ఆయన ప్రశ్నకు సమాధానం లేదు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదని, పొత్తు విషయంలో పునరాలోచించుకోవాలని పార్టీ నాయకుడు పవన్‌ కళ్యాణ్‌కు ఆయన సూచించడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఆమంచి స్వాములు రెబల్‌ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్వాములు ప్రకటించారు. దీంతో టీడీపీ, జనసేన కూటమిలో లుకలుకలు మొదలైనట్లు తెలుస్తోంది.

### దర్శిపై దోబూచులు..

దర్శి నియోజకవర్గంలో సైతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఇది కూడా మొదట్నుంచీ జనసేనకు ఇస్తారంటూ ప్రచారం జరిగింది. దీంతో ఎన్నారై గరికపాటి వెంకట్‌ ప్రచారాన్ని సైతం చేసుకుంటూ వచ్చారు. సీటు తనకే వస్తుందని ఆశపడ్డారు. పలు కార్యక్రమాలను సైతం నిర్వహించారు. అయితే ఈ సీటుపై టీడీపీ అధినేత చంద్రబాబు తనస్టైల్‌లో కుట్రలకు తెరతీశారు. దర్శిపై దోబూలాట మొదలెట్టారు. ఎల్లో మీడియా ద్వారా రోజుకో ప్రచారాన్ని చేయిస్తూ వస్తున్నారు. ఈ సీటును జనసేనకు కాకుండా టీడీపీకి కేటాయిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. ఒంగోలు పార్లమెంట్‌ పరిధిలో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ దర్శిపై క్లారిటీ ఇవ్వలేదు. నోటిఫికేషన్‌ వచ్చి పది రోజులవుతున్నా ఇప్పటి వరకు ఇక్కడ అభ్యర్థిని ప్రకటించకుండా తాత్సారం చేస్తోంది. దీంతో కూటమి పార్టీల్లో నాయకులు, కార్యకర్తలు చిరాకుపడుతున్నారు. ఒకవేళ ఇక్కడ నుంచి జనసేన తరఫున ఎవరు పోటీ చేసినా అభ్యర్థి మాత్రం తెలుగుదేశం పార్టీకి చెందిన వారే ఉండేలా చంద్రబాబు తెరవెనుక మంత్రాంగం నెరపుతున్నట్టు సమాచారం.

### జనసేనలో... గొడవలు.. గ్రూపులు

జనసేన పార్టీలో ప్రకాశం జిల్లాలో ఎక్కడ చూసినా గ్రూపులు, గొడవలతో సతమతమవుతోంది. కొండపి నియోజకవర్గంలో ఇన్చార్జి మనోజ్‌ కుమార్‌, సింగరాయకొండ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిన రాజేష్‌ గ్రూపులు కొనసాగుతున్నాయి. ఈ రెండు గ్రూపుల మధ్య పరిస్థితి ఉప్పు నిప్పులా ఉంది. ఇటీవల సింగరాయకొండలో ఈ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. చొక్కాలు పట్టుకొని కొట్టుకున్నట్లు చెప్పుకుంటున్నారు. ఒంగోలు సంగతి తెలిసిందే. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు షేక్‌ రియాజ్‌, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ వర్గాలు తరచుగా ఘర్షణ పడుతున్నారు. గత నెలలో రియాజ్‌ వర్గం అరుణను వెంటాడి దాడి చేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అరుణ తన మీద జరిగిన దాడి విషయాన్ని పార్టీ అధినేత పవన్‌ కళ్యాణ్‌ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పుడు తాను పొత్తుల పనిలో బిజీగా ఉన్నాను.. ఎన్నికల తరువాత కూర్చొని మాట్లాడుదామని చెప్పడం విమర్శలపాలైంది. యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జిగా పి.గౌతం రాజును నియమించారు. గుంటూరులో వైద్యం చేసే ఆయన ఏడాది క్రితమే ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వీలు చిక్కినప్పుడు మాత్రమే యర్రగొండపాలేనికి వచ్చిపోతున్నారు. మార్కాపురం, కనిగిరి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో జనసేన నామమాత్రంగా ఉంది. మార్కాపురంలో ఇమ్మడి కాశీనాథ్‌ ఒక్కడే హోల్‌ అండ్‌ సోల్‌ నాయకుడిగా చెలామణి అవుతున్నారు.

### రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కల్పనరెడ్డి

కొమరోలు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపంలో వెలసిన తిరుమలనాథ స్వామి తిరునాళ్ల మహోత్సవాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రకాశం, కడప జిల్లాల్లోని ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కె.పి.నాగార్జునరెడ్డి సతీమణి కల్పనారెడ్డి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్పనరెడ్డి కొద్దిసేపు ప్రజలతో మాట్లాడారు. అనంతరం కల్పనరెడ్డికి స్థానికులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, గ్రామసర్పంచ్‌ బంగారు రత్నాలు, వైస్‌ ఎంపీపీ షేక్‌ మౌలాలి, ఎంపీటీసీలు వెంకట రమణ, తిరుమలరాజు, వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు బంగారు విశ్వరూపం, మాబు, గోల్కొండ సుభాని, రామలింగయ్య, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ పట్టపు సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

టంగుటూరు: ఆంధ్రప్రదేశ్‌ పట్టపు సంక్షేమ సంఘం ప్రకాశం, బాపట్ల జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మండలంలోని సూరారెడ్డిపాలెం శ్రీనిధి ఒకేషనల్‌ కాలేజీలో సోమవారం జరిగింది. ఈ ప్రమాణ స్వీకారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట రమణ నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాయిల మోహనరావు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు శివాజీ, శ్రీనివాసులు, జకరయ్య, తిరుపతిరావు, శ్రీనివాసరావు, జాలయ్య, శ్రీనిధి విద్యా సంస్థల కరస్పాండెంట్‌ విజయరత్నం పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- సభ్యత, సంస్కారం మరిచి మాట్లాడుతున్న జనార్దన్‌
- నన్ను గెలిపిస్తే 9 నెలల్లోనే 25 వేలమందికి ఇళ్లు కూడా కట్టించి ఇస్తా
- 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి




వైఎస్సార్‌ సీపీలో చేరిన వారికి కండువా వేసి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: రాజకీయాలకు అతీతంగా 47వ డివిజన్‌లో అభివృద్ధి చేపట్టామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలో సోమవారం రాత్రి డివిజన్‌ అధ్యక్షుడు చావలి శ్రీనివాసరావు, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్‌ సాధం విజయలక్ష్మి, కావేరి ఆనందరావు నేతృత్వంలో పాతిక కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలోకి చేరాయి. ఆవుల కోటేశ్వరరావు, రాంబాబు, గొర్రె లక్ష్మి, మర్రి సుబ్బయ్య, మూరబోయిన శ్రీకాంత్‌, మూరబోయిన వాసు, బాలారి శ్రీనివాసులు, మూరబోయిన సుకన్య, సాధం అంజనదేవి, రాజసులోచన, కె.లావణ్య, మిండ శ్రీను, అంజలి, గౌరుబోయిన శ్రీను, పెయ్యల రామకృష్ణ, నలగల్లు అయ్యప్ప, మల్లిబోయిన పద్మ, కఠారి రమణమ్మ, మర్రి సురేష్‌, గుమ్మడి తిరుపతయ్య కుటుంబాలకు బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 47వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలిచినా 374 మందికి ఇళ్ల పట్టాలను ఈ డివిజన్‌లో ఇచ్చామన్నారు. కేశవరాజు కుంట వద్ద పెళ్లి కానుక అంటూ టీడీపీ మహిళా నాయకురాళ్లు 180 మందికి దొంగ పట్టాలు ఇచ్చిన జనార్దన్‌ నేడు ప్రభుత్వం కొనుగోలు చేసి పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తే దొంగ పట్టాలు అంటూ మాట్లాడడం అతని నైజానికి నిదర్శనం అన్నారు. తాను గత 30 సంవత్సరాలకు పైగా రాజకీయాల్లో ఉన్నా జనార్దన్‌లా సభ్యత, సంస్కారం మరిచి మాట్లాడే వ్యక్తులను తాను చూడలేదని, కానీ నేడు పిల్లసైకో అంటూ తన కుమారుడ్ని మాట్లాడుతున్న జనార్దన్‌ పెద్ద సైకో అయి ఉంటాడన్నారు. అధికారంలోకి రాగానే అంతుచూస్తానంటూ ప్రజలను హెచ్చరించడం జనార్దన్‌కు పరిపాటిగా మారిందని, కానీ తాము అధికారంలో ఉన్నా సభ్యత, సంస్కారంతోనే వ్యవహరిస్తున్నామన్నారు. మాట్లాడితే జనార్దన్‌ గోల్డెన్‌ స్పూన్‌తో పుట్టినట్లుగా చెప్పుకుంటుంటారని, కానీ వాళ్ల తాతలు మా పొలాల్లో పొగాకు కొనుగోలుకు మధ్యవర్తులుగా వచ్చేవారన్నారు. తమను వ్యక్తిగతంగా విమర్శించడం మానుకోవాలని జనార్దన్‌కు హితవు పలికారు. జనార్దన్‌ బెంగళూరు పబ్బుల్లో తిరిగే ఫొటోలు తన వద్ద ఉన్నాయని, సభ్యత, సంస్కారం ఉన్న వ్యక్తిని కాబట్టే నేను వాటిని బహిరంగం చేయడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు గమనించి వచ్చే ఎన్నికల్లో తనను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్‌, గొర్రెపాటి శ్రీనివాసరావు, గంటా రామానాయుడు, కటారి ప్రసాద్‌, బొట్ల సుబ్బారావు, చావలి శివ, గృహ లక్ష్మి, వాణి, అంగిరేకుల గురవయ్య, మోరుబోయిన సురేష్‌, డివిజన్‌ నాయకులు సీహెచ్‌ సుబ్రహ్మణ్యం, పి.ఏడుకొండలు, సాధం నరశింహారావు, ఎంఆర్‌ఎఫ్‌ బుజ్జి, ఆవుల మనోజ్‌కుమార్‌, లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లంటేనే బాబు, పవన్‌కు
# ముచ్చెమటలు

- భయాన్ని కప్పిపుచ్చుకుంటూ ఇష్టం వచ్చినట్లుగా ఆ వ్యవస్థపై విమర్శలు చేయడం హాస్యాస్పదం
- ఉగ్రవాదులతో పోలుస్తూ టీడీపీ నేతలు మాట్లాడుతున్న తీరు గర్హనీయం
- తక్షణమే టీడీపీ నేతలు వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే బాలినేని, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె

ఒంగోలు:

వలంటీర్‌ పేరు తలుచుకుంటేనే చంద్రబాబు, పవన్‌తోపాటు ఆ పార్టీల నేతలకు ముచ్చెమటలు పడుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్‌ జంకె వెంకటరెడ్డి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రజా రంజకంగా ఉండబట్టే నేడు చంద్రబాబు అండ్‌ కోకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమంటూ వారిని మానసికంగా, వ్యక్తిగతంగా వేధించడం గతం నుంచే ప్రారంభించారని, నేడు అంతకంటే దారుణంగా జిహాదీలు, ఉగ్రవాదులు, స్లీపర్‌ సెల్స్‌ అంటూ మాట్లాడడం ప్రజలు గమనించాలన్నారు. నేడు విమర్శలు గుప్పిస్తున్న వారు కరోనా సమయంలో ఏమయ్యారు, మిమ్మల్ని ఆదుకున్నది ఎవరు, మీకు ప్రతిక్షణం అందుబాటులో ఉంటూ మీ ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మీకు సేవలు అందించింది ఈ వాలంటీర్లే అన్న విషయం మరువరాదన్నారు. మంచి చేసిన వారిని మనం విస్మరిస్తే మనలను మంచి కూడా విస్మరిస్తుందని గమనించాలన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతామని ఒకరు, వారి కథ తేలుస్తామంటూ మరొకరు చేస్తున్న వ్యాఖ్యలు వారిలో గూడుకట్టుకున్న భయానికి నిదర్శనం అన్నారు. గతంలో జన్మభూమి కమిటీ జేబులు నింపే మొత్తాలు నేడు నేరుగా ప్రజల ఖాతాల్లోకి చేరుతుండడంతో తట్టుకోలేక ఇష్టం వచ్చినట్లు ఆరోపిస్తున్నారన్నారు. గతంలో కేవలం పార్టీ నేతలు సూచించిన వారికి మాత్రమే లబ్ధి జరిగేదని, కానీ నేడు కులం, మతం, ప్రాంతం, సిఫారసులతో సంబంధం లేకుండా నేరుగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి కలిగేలా వలంటీర్లు పనిచేస్తుండమే టీడీపీకి కంటగింపుగా మారిందన్నారు. వీళ్లను ఎలాగైనా మానసికంగా తొలగించి మళ్లీ జన్మభూమి కమిటీలను తెరపైకి తీసుకురావాలనే దురుద్దేశంతోనే ఈ వ్యవహారం నడుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తుంటే వారి కుటుంబాల్లోని 10 లక్షల మందిని తీవ్రంగా మానసిక క్షోభకు గురిచేస్తున్న టీడీపీ అరాచకాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. వయస్సు మళ్లిన వారికి ఇంటిదగ్గరకే వెళ్లి తలుపుతట్టి పెన్షన్‌ అందించడం జిహాదీ అని, కోవిడ్‌ వంటి మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన వారిని స్లీపర్‌ సెల్స్‌ అంటూ టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవన్నారు. వలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతలు తక్షణమే క్షమాపణ చెప్పడంతోపాటు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి డిమాండ్‌ చేశారు.

# జగన్‌కు పేరొస్తుందనే వలంటీర్లపై ఆరోపణలు

- చౌకబారు విమర్శలతో వలంటీర్‌లపై తప్పుడు ఆరోపణలు
- మంత్రి మేరుగు నాగార్జున
- చీమకుర్తి అర్బన్‌, రూరల్‌ ప్రాంతాల్లో ప్రచారం



నాయుడుపాలెంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: చంద్రబాబునాయుడు కుయుక్తులు, పవన్‌ కల్యాణ్‌ చిల్లర వేషాలు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చెల్లవని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవల వలన వైఎస్‌ జగన్‌కు పేరొస్తుందనే చంద్రబాబునాయుడు వలంటీర్లపై చౌకబారు విమర్శలతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం చీమకుర్తి రూరల్‌, అర్బన్‌లో మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రచార కార్యక్రమాలతో పాటు మీడియాతో మాట్లాడారు. స్వచ్ఛందంగా ఇంటింటికీ సేవా కార్యక్రమాలు అందిస్తున్న వలంటీర్లను చంద్రబాబు చులకనగా చూడటంపై ఆయన వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల ద్వారా వస్తున్న ఆదరణతో జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాకు తట్టుకోలేక చంద్రబాబు శివాలెత్తిపోతున్నాడన్నారు. తొలుత మంత్రి నాగార్జున పీ.నాయుడు పాలెం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్థానికంగా ఉన్న 10 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వారికి మంత్రి నాగార్జున పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సిద్దు, సాయికుమార్‌, తిరుపతిస్వామి, సాయి, చెన్నకేశవ, వెంకటేశ్వర్లు, నరేంద్ర, చిన్న, శ్రీను, కిట్టు ఉన్నారు. అనంతరం రాత్రి చీమకుర్తి మున్సిపాలిటీలోని 4, 5 వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించి రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మంత్రి మేరుగు నాగార్జున ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను గుర్తు పెట్టుకొని మళ్లీ సీఎంగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు పార్టీ కార్యకర్తలు నడుంబిగించాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్‌ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, పాలడుగు సుబ్బారావు, దుడ్డు మార్కు, అత్యాల దావీదు, అత్యాల కౌశిక్‌, పాటిబండ్ల అశ్వద్దామ, స్థానికులు పాల్గొన్నారు.



చీమకుర్తి పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

# సేవ చేసేందుకు వచ్చా..ఒక్క అవకాశం ఇవ్వండి

- మంత్రి ఆదిమూలపు సురేష్‌



నర్శింగోలు లో మాట్లాడుతున్న మంత్రి సురేష్‌

జరుగుమల్లి: ''కొండపి నియోజకవర్గానికి సేవ చేయడానికి వచ్చాను. ఒక్క అవకాశం ఇవ్వండి. జగనన్న పంపించిన 'సేవకుడిని'' అని మంత్రి ఆదిమూలపు సురేష్‌ అన్నారు. మండల పరిధిలోని నర్శింగోలు, రామచంద్రాపురం గ్రామాల్లో 'పల్లె పల్లె కు సురేష్‌' కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఐదు సంవత్సరాలు అందించిన సంక్షేమ పథకాలు, సచివాలయాలు నిర్మించి చిట్ట చివర కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఏ పార్టీ అనేది చూడకుండా పేదరిక నిర్మూలన చేశారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేశారని చెప్పారు. పేద బడుగు, బలహీన వర్గాలకు సుపరిపాలన అందించిన జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే సంక్షేమ ఫలాలు కొనసాగుతాయన్నారు. ఎక్కడా మాట తప్పకుండా విశ్వసనీయతతో మేలు చేయాలనే సంకల్పంతో ప్రజలతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. పొత్తులతో వస్తున్నచంద్రబాబుకు దాచుకోవడం, దోచుకోవడమే తెలుసన్నారు. జగనన్న 125 సార్లు బటన్‌ నొక్కారు..మీరు రెండు సార్లు ఈవీఎం బటన్‌ నొక్కి పార్లమెంట్‌ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను గెలిపించాలని కోరారు. కొండపి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మూడు నెలల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఒక్క అవకాశం ఇస్తే కొండపి అభివృద్ధికి శ్రీకారం చుడతానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు పాటిబండ్ల నాగేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు, వైఎస్‌ఆర్‌ సీపీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్‌, మండల జేసీఎస్‌ కన్వీనర్‌ తాటికొండ రామచంద్రరావు, ఎంపీటీసీ పాటిబండ్ల భవాని, సర్పంచి ఏజెర్ల ఇక్కయ్య, మాజీ జెడ్పీటీసీ జడా రిచర్డ్స్‌, కుంచాల బ్రహ్మయ్య, కొర్రకూటి వెంకటేశ్వర్లు, రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు పావులూరి రామారావు, బాపయ్య, రవి, బీరల వెంకటేశ్వర్లు, పలువురు మండలంలోని సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న ఆదిమూలపు సురేష్‌

## క్లుప్తంగా

### కంభంలో బైక్ చోరీ


బైక్ దొంగిలించి తీసుకెళ్తున్న వ్యక్తి (సీసీ ఫుటేజీ)

కంభం: పట్టపగలే బైక్ అపహరణకు గురైంది. ఈ సంఘటన స్థానిక చౌకసెంటర్‌లో సోమవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..షేక్ ఇబ్రహీం అనే వ్యక్తి రంగు డబ్బా తీసుకునేందుకు చౌకసెంటర్ లోని ఓ దుకాణం వద్దకు వెళ్లాడు. వెనక్కి వచ్చే సరికి బైక్ అదృశ్యమైంది. పక్కనే ఉన్న ఓ దుకాణంలోని సీసీ ఫుటేజిని పరిశీలించగా సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు ఆ ప్రాంతంలో ఉండి గమనిస్తూ ద్విచక్రవాహనం పెట్టి షాపులోకి వెళ్లి తిరిగి వచ్చిన నాలుగైదు నిముషాల్లోనే అపహరించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో పట్టణంలో మూడు, నాలుగు బైక్‌లు అపహరణకు గురయ్యాయి.

### పాలేరులో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు

- మైనింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ


ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న మైనింగ్ ఇన్‌స్పెక్టర్ మురళి

జరుగుమల్లి: మండల పరిధిలోని పాలేరు నదిలో ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని మైనింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలోని పాలేరు నదిలో జరుగుమల్లి, చతుకుపాడు, కామేపల్లి ఇసుక రీచ్‌లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. జరుగుమల్లి వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి సింగరాయకొండ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీలో టెక్నికల్ సహాయకుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

### 756 బస్తాల రేషన్ బియ్యం సీజ్


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

త్రిపురాంతకం: రైస్ మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 756 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఈ సంఘటన సోమవారం త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జితేంద్ర, రెవెన్యూ సిబ్బంది కలిసి గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్‌పై దాడి చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని యర్రగొండపాలెంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌కు తరలించారు. రైస్ మిల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.



ఒంగోలు నగరంలో చిన్నారులు, యువతుల ఉత్సాహం


హోలీ శుభాకాంక్షలు చెబుతూ..


గులాం చల్లుకుంటూ సందడి చేస్తున్న యువతులు


కేరింతలు కొడుతున్న యువత


రంగుల్లో మునిగితేలుతూ..

# సంతోషానికి గులాం

జిల్లాలో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. చిన్నారులు, యువత గులాం చల్లుకుంటూ సంబరాల్లో మునిగి తేలారు. ఈ చిత్రాలు ఒంగోలు నగరంలో రాజస్థాన్ వాసులు, మార్వాడీల నివాస ప్రాంతాల్లో 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి, ఒంగోలు



శ్రీవారి కల్యాణం..

# చూసిన కనులదే భాగ్యం


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


గోవింద నామ స్మరణ చేస్తున్న భక్తులు

- స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ
- ఆద్యంతం ఉత్సాహంగా సాగిన రాయబార ఘట్టం
- కనులారా వీక్షించి పరవశించిన భక్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో శ్రీలక్ష్మి, అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం వేకువజామున వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన మండపంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి భక్తులు తరించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉభయదాతలు శ్రీవారికి పసిడి, రజత ఆభరణాలు, పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేద పండితులు భార్గవాచార్యులు, ప్రసాదాచార్యులు, పవన్‌కుమార్‌శర్మ, తిరుమాచార్యులు కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్యాఖ్యాతగా తాల్లూరి దుర్గా వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వెలుగొండ పరిసర గ్రామాల ప్రజలతోపాటు ఒంగోలు, మార్కాపురం, విజయవాడ, తెనాలి, వినుకొండ, నంద్యాల, హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉభయదాతలుగా వాగిచెర్ల, జూటూరి, మూర్తి, తాడి కుటుంబ సభ్యులు, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి దంపతులు వ్యవహరించారు. తొలుత తాడివారిపల్లికి చెందిన తాడివారు ఆచారం ప్రకారం కత్తులు, కటార్లతో గుర్రాలపై ఆలయం వద్దకు వచ్చారు. వరుడు, వధువు తాలూకువారితో నిశ్చితార్థ రాయబార ఘట్టం ఛలోక్తులతో ఉత్సాహంగా సాగింది. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

# వాసన్న ఆధ్వర్యంలోనే యాదవుల సంక్షేమం

- టీడీపీకి దమ్ముంటే యాదవులకు ఏం చేసిందో చెప్పాలి
- యాదవుల ఆత్మీయ సభా వేదికపై టీడీపీ జిల్లా, నగర అధ్యక్షులకు గౌరవం ఇవ్వని మీరా బాలినేని గురించి మాట్లాడేది?
- చెప్పుకునేందుకు చేసిందేమీ లేక ఇతర పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు
- దామచర్ల జనార్దన్ వైఖరిపై భగ్గుమన్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ యాదవ్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ యాదవ్, పాల్గొన్న యాదవ నాయకులు

ఒంగోలు: బాలినేని వాసన్న ఆధ్వర్యంలోనే జిల్లాలో యాదవుల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ యాదవ్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవుల ఆత్మీయ సభ అంటే ఆ సామాజిక వర్గానికి తమ పార్టీ ఏం చేసిందో, చెప్పడం, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ఏం చేస్తారో చెబుతారని ప్రతిఒక్కరూ ఆశిస్తారన్నారు. కానీ, అందుకు భిన్నంగా బాలినేని ప్రణీత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం ద్వారా టీడీపీ నాయకులు వారి స్థాయిని మరింత తగ్గించుకున్నారన్నారు. మీకు దమ్ముంటే టీడీపీ హయాంలో యాదవులకు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. యాదవుల ఆత్మీయ సభలో టీడీపీ నగర, జిల్లా అధ్యక్షులకు కనీసం వేదికపై సముచిత స్థానం కల్పించలేని మీరా మా గురించి విమర్శించేది అంటూ మండిపడ్డారు. దిబ్బలరోడ్డులో ఉన్న స్థలం లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వ ప్రతిపాదన వచ్చిందని, అదే సమయంలో ప్రసాద్ అనే వ్యక్తి వారికి సంబంధించిన నష్టపరిహారం కింద ఆ భూమి తమదంటూ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. అందువల్ల పెండింగ్‌లో పడిందన్నారు. ఇది 2002 నుంచి మున్సిపాలిటీలో ఫైల్ నడుస్తుంటే.. ఆ భూమికి జనార్దన్ శంకుస్థాపన చేస్తే బాలినేని అడ్డుకున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. రాచగొర్ల వెంకట్రావు చేసిన ఈ వ్యాఖ్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే బాలినేని తమకు శ్రీకృష్ణ కళ్యాణ మండపం, యాదవ్ భవన్ రెండింటికీ ఉపయోగపడేలా 70 సెంట్ల స్థలం కేటాయించారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా తొలి అధ్యక్షుడిగా యాదవులనే కేటాయించారన్నారు. బాలినేని కాంగ్రెస్‌లో ఉన్నపుడు కూడా జెడ్పీ చైర్‌పర్సన్, ఒంగోలు మున్సిపల్ చైర్మన్ పదవులను కూడా యాదవులకే కేటాయించారన్నారు. ఒంగోలులో ఆరామక్షేత్రాలకు స్థలాల కేటాయింపుతో పాటు ఒంగోలు వ్యవసాయ మార్కెట్‌కు తొలిసారిగా యాదవులకే చైర్మన్‌గా అవకాశం ఇచ్చారని శంకర్ తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ కొటారి రామచంద్రరావు మాట్లాడుతూ గడికయ్యల స్థలాల కోసం ఉద్యోగులు రంగంలోకి దిగితే.. ఏళ్ల తరబడి వాటి ద్వారా లబ్ధిపొందుతున్న యాదవుల కుటుంబాలకే అంటూ బాలినేని కేటాయించారన్నారు. కరోనా సమయంలో చంద్రబాబు, ఆ పార్టీ జిల్లా నాయకులు ఏమైనా గాడిద పళ్లు తోమడానికి వెళ్లారా అని ప్రశ్నించారు. బెంగళూరులో కూర్చుని వ్యాపారాలు చేసుకుంటూ కనీసం జనం ఏమయ్యారో కూడా పట్టించుకోకుండా నేడు ఓట్ల కోసం వచ్చి కల్లబొల్లి మాటలు చెబితే వినేందుకు యాదవులు సిద్ధంగా లేరన్నారు. ఏ అభివృద్ధి జరుగుతున్నా కోర్టుల ద్వారా అడ్డుకోవడం తప్ప ఆదుకునేందుకు ఏనాడైనా ముందుకొచ్చారా అంటూ ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి అవినీతికి బాహాటంగా తలుపులు తెరిచి ఇప్పుడు ప్రణీత్‌రెడ్డి గురించి విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. కార్పొరేటర్ యనమల నాగరాజు, చల్లా తిరుమలరావు, జడా వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రూ.230 కోట్లు వెచ్చించి ఇళ్ల స్థల పట్టాలను 21 వేల మందికి రిజిస్ట్రేషన్ చేసిస్తే.. వాటిని దొంగ పట్టాలంటూ అబద్ధాలు చెప్పే టీడీపీ నాయకులను ప్రజలు ఎందుకు నమ్మాలని ప్రశ్నించారు. కేవలం మీ సామాజికవర్గం తప్ప ఆత్మీయ సమావేశంలో యాదవులు పెద్దగా లేరని, దీనిని బట్టే టీడీపీలో యాదవుల స్థానం ఏమిటో స్పష్టమవుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ దామచర్ల జనార్దన్ గుర్రం మీద ఎందుకు ఊరేగారో కూడా జనాలకు అర్థం కాలేదన్నారు. కమ్మపాలెం, గోపాలనగరంలో సగం రోడ్లు వేసి ప్రజలను కష్టాల పాలు చేసినందుకా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినేని మురళి, 5వ డివిజన్ నాయకులు ఎండేటి రంగారావు, చావలి శివ, మాజీ జెడ్పీటీసీ మట్టె రాఘవ, సంజీవి, శ్రీనివాసరావు, అంగిరేకుల గురవయ్య, విస్సు యాదవ్, సుబ్బారావు, నాగం వెంకట్రావు, బుష్, కటారి ప్రసాద్, సురేంద్ర, బత్తుల కాశయ్య యాదవ్, తాళ్లపాలెం శ్రీను, బొంతా గంగాధర్, నాగేశ్వరరావు, నాగరాజు, జాజుల శ్రీనివాసరావు, జమ్ము శ్రీకాంత్, కోటి యాదవ్, గండు మధు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనృసింహుని పరిణయం


లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దిపాడు: పృథులగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి స్వామి కళ్యాణం వైఖానస ఆగమ శాస్త్రానుసారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు నారాయణం మారుతీచార్యులు స్వామివారికి విశేష పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తూ ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల నృసింహ నామస్మరణలో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఎదుర్కోలు ఉత్సవానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ దంపతులు, కళ్యాణానికి బీఎల్ఎన్‌శాస్త్రి, సదాశివయ్య కుమారులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వేలాదిగా హాజరైన భక్తులు మొక్కులు చెల్లించి, కల్యాణాన్ని కనులారా తిలకించారు.


ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న ఉభయదాతలు కుప్పం ప్రసాద్ దంపతులు

# ముళ్ల పొదల్లో సగం కాలిన ఔషధాలు

- విచారణ చేపడతామన్న డీఎంహెచ్‌ఓ

కనిగిరి రూరల్: కనిగిరి 1వ సచివాలయం పరిధిలోని ఇందిరా కాలనీ సమీపంలో ముళ్ల పొదల్లో సగం కాలిన ఔషధాలు, ఆరోగ్య సురక్ష సంచులు దర్శనమివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఔషధాలు అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్‌కు చెందినవిగా తెలుస్తోంది. యూపీహెచ్‌సీలో వైద్యాధికారి, సిబ్బంది మధ్య కొంత కాలంగా సాగుతున్న అంతర్గత పోరే ఈ దుశ్చర్యకు కారణమని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ.. కాలం చెల్లిన మందులు తగలబెట్టాల్సి వస్తే పీహెచ్‌సీ అధికారి అనుమతి తీసుకుని, రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఇవన్నీ ఉన్నతాధికారుల విచారణలోనే తేలాల్సి ఉంది. దీనిపై డీఎంహెచ్‌ఓ సృజన స్పందిస్తూ.. మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలిస్తామని, రికార్డులు కూడా తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.


సగం కాలిన ఔషధాలు

# వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

ఒంగోలు: స్థానిక 46వ డివిజన్‌లో పలువురు టీడీపీ నేతలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పెర్ల విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక లంబాడీడొంకలో నిర్వహించిన కార్యక్రమంలో మూడు దశాబ్దాలుగా టీడీపీలో ఉన్న షేక్ ఆలీతోపాటు పలువురు స్థానికులు, వివిధ డివిజన్లలోని అతని మిత్రబృందం మొత్తం 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా తాను ఉన్నానని భరోసా ఇచ్చారు. ఆలీతో పాటు పార్టీలో చేరిన వారిలో కందుకూరి వేణు, గుండేటి పిచ్చయ్య, వర్ధినేని లక్ష్మీ శ్రీనివాసరావు, సుబ్బారావు, అబ్బాస్, షేక్ అక్బర్, సుందర్, షేక్ బాచి, పాతూరి నాగరాజు, షేక్ నజీర్, అనీల్, హనుమంతరావు, ఫడ్నవీస్, సయ్యద్ అబ్దుల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేముల విజయ్, మహేష్, గాదె కోటిరెడ్డి, సోమిశెట్టి నారాయణ, రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి తదితరులు పాల్గొన్నారు.


బాలినేని ప్రణీత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఆలీ, అతని మిత్రబృందం

# వైఎస్సార్ సీపీలో చేరిన 150 మంది

గిద్దలూరు రూరల్: మండలంలోని తాళ్లపల్లె, కొత్తకోట గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాల వారు గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో ఒంగోలు రోడ్డులోని ఆయన అతిథి గృహంలో సోమవారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీకి విధేయులుగా ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. జగనన్న పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో జొన్నకూటి రామిరెడ్డి, శీలం శేఖర్‌రెడ్డి, శీలం బైపురెడ్డి, బ్రహ్మం బాషా, సయ్యద్ అమీర్, గంగారావు, కంచర్ల బ్రహ్మం, బోగోలు వెంకటేశ్వర్లు, నర్రాల వెంకటరెడ్డితో పాటు పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, వడగరాజు బాలరాజు, గోనె గురవయ్య, రంపె వెంకటేశ్వర్లు, బండి రాముడు, శీలం చిన్నపురెడ్డి పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి